క్లుప్తంగా

నేటి నుంచి జొన్నల కొనుగోళ్లు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం నుంచి ప్రభుత్వ మద్దతు ధరతో జొన్నలు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్ తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే రైతులు తాము పండించిన జొన్నలను వ్యవసాయా మార్కెట్‌కు తీసుకొని రావాలని కోరారు. ఈ నెల 12న మండలంలోని జున్ని, కామాగిరి, అడేగామ(బి), అడేగామ(కె) గ్రామాల రైతులు తమ పండించిన జొన్నలను మార్కెట్‌కు తీసుకొని రావాలని కోరారు. ఈనెల 15న కోకస్ మన్నూర్, ముఖరా(బి), ముఖరా(కే). 19న దర్మంపూరి, గుండివాగు, గుండి. 22న మాన్కపూర్, నవేగావ్, సల్యాద. 26న చించోలి, గేర్జం, జల్దా, జామిడి, నర్సాపూర్, దాబా కే. 28న దాబా(బి), హిరపూర్, మాదపూర్, తలమద్రి, గాయిద్‌పల్లి, గుండాల, కేశవపట్నం, లింగపూర్, సిరిచెల్మచ. 30న బాబుల్‌డోల్, బోరిగామ గుబ్బ, ఇచ్చోడ గ్రామాల రైతులు జొన్నలను మార్కెట్‌యార్డుకు తీసుకొని రావాలని కోరారు.

బోథ్‌లో నేడు, రేపు కొనుగోళ్లు బంద్

బోథ్: బోథ్ మార్కెట్‌యార్డుతో పాటు ధన్నూర్(బి) గ్రామాల్లో సోమ, మంగళ వారాల్లో జొన్న కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. వాతావరణం అనుకూలించకపోవడంతో రెండు రోజుల పాటు కొనుగోళ్లను నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు గమనించాలని కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రవీందర్

బోథ్: బోథ్ మండల బీజేపీ అధ్యక్షుడిగా బోరె రవీందర్ ఎన్నికయ్యారు. ఆదివారం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోరె రవీందర్, ఉపాధ్యక్షుడిగా బారె భోజన్న, శివప్రసాద్, కచ్చకాయల హరీశ్, ఈదపు సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రోహిత్, జుగాది రావ్, కార్యదర్శులుగా బడాల శ్రీకాంత్ రెడ్డి, ఉప్పుల నారాయణ, శ్రీకాంత్, ఆల్లం స్వామి, ముండాల రాజేందర్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా కొడప విజయ్ కుమార్, ఎస్సీ మొర్చా అధ్యక్షుడిగా నల్ల గంగయ్య, బీసీ మోర్చా అధ్యక్షుడిగా జిట్ట శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

సామల సదాశివ మాస్టారు జయంతి


నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

బోథ్: బోథ్ మండల కేంద్రంలోని భక్త మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సామల సదాశివ మాస్టారు 97వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు గంగుల మల్లేష్ మాట్లాడుతూ.. సదాశివ మాస్టారు సాహిత్యంలో, ఎన్నో భాషలలో రచనలు చేశారని గుర్తు చేశారు. ఆయనకు ప్రభుత్వం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందజేసిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సిరిపురం చంద్రమోహన్, పట్టణ అధ్యక్షుడు మాసం అనిల్ కుమార్, బిట్లింగ్ నర్సయ్య, కొమారి దయాకర్, కొండా స్వామి, తడ్క పోశెట్టి పాల్గొన్నారు.

'ఓపెన్' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాంసి: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తాంసి పాఠశాల హెచ్ఎం ఆదివారం శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు మండల కేంద్రంలోని తాంసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పాఠశాల విద్యకు దూరమై 14 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు ఓపెన్ పదో తరగతికి, 15 సంవత్సరాలు నిండిన వారు ఇంటర్మీడియట్ ప్రవేశానికి అర్హులన్నారు.

ఘనంగా నరసింహ స్వామి జయంతి


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

తాంసి: మండలంలోని వడ్డాడి స్వయంభూ లింబాద్రి నరసింహ స్వామి ఆలయంలో ఆదివారం నరసింహ స్వామి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి విష్ణుష్ ఆధ్వర్యంలో గణపతిపూజ, హోమం, అభిషేకం, స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, నారాయణ, రామన్న, నర్సింగ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తయ్యేదెప్పుడో?


మామిడిగూడ గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్డు

- టెండర్ పూర్తయినా ప్రారంభం కాని వంతెన పనులు
- ఇబ్బంది పడుతున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని హర్కపూర్ ఆంధ్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిగూడ(జి), మామిడిగూడ(బి) గ్రామాల ఆదివాసీలకు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం రోడ్డు, వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కానీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు. నాలుగు నెలల నుంచి రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ అర్ధాంతరంగా నిలిపివేశాడు. అలాగే వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైన పనులు ప్రారంభించలేదు. దీంతో రెండు గ్రామాల ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు.

ముందుకు సాగని పనులు..

అంజీ గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిగూడ(ఏ) నుంచి రెండు కిలోమీటర్ దూరంలో ఉన్న హర్కపూర్ ఆంధ్‌గూడ గ్రామపంచాయతీ పరిధిలోని మామిడిగూడ(బి), మామిడిగూడ(జి) గ్రామాలకు రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వాగు వద్ద వంతెన లేక పోవడంతో ప్రమాదకరంగా వాగు దాటి రాకపోకలు సాగిస్తున్నారు. 2023లో మామిడిగూడ గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1 కోటి, వంతెన నిర్మాణానికి రూ. 3 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేశారు. రోడ్డు పనులకు టెండర్లు పూర్తి చేసి ఐటీడీఏ అధికారులు కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే కేవలం మట్టి రోడ్డు, చిన్న చిన్న కల్వర్టు పనులు పూర్తి చేసి నాలుగు నెలలుగా పనులు ఆపేశాడు. వంతెన పనులకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఇటీవల టెండర్ పూర్తి చేసి, కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కానీ వంతెన నిర్మాణ పనులు కూడా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇంకెన్నాళ్లు ప్రయాణ కష్టాలు పడాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించడం లేదు



మా గ్రామాలకు రోడ్డు, వాగు వద్ద వంతెన లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిధులు మంజూరైనా అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారు. కాంట్రాక్టర్ మట్టి, చిన్న కల్వర్టు పనులు చేసి మధ్యలో పనులు నిలిపివేశాడు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్, అధికారులు రోడ్డు సమస్యను పరిష్కరించాలి.
– సేడ్మాకి భీంరావ్, మామిడిగూడ(బి)

సమస్య లేకుండా చూడాలి

రెండు గ్రామాలకు రోడ్డు లేక, వాగుపై వంతెన లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ప్రాణాలను పణంగా పెట్టి వరద నీటిని దాటి రాకపోకలు సాగిస్తున్నాం. అత్యవసర సమయంలో ఆస్పత్రులకు వెళ్లలేక పోతున్నాం. ఇప్పటికైనా అధికారులు రోడ్డు పనులు పూర్తి చేయాలి.
– మెస్రం నాగోరావ్, మామిడిగూడ(బి)

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్


బహుమతులు అందజేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని తంతోలి గ్రామంలో గత కొన్ని రోజులుగా జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న హాజరై గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి తంతోలి జట్టుకు రూ. 40వేలు, రెండో బహుమతి చించుఘాట్ రూ. 20వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలలో రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, సేవ్వా జగదీష్, అశోక్ స్వామి, గంగయ్య, కనక రమణ, సతీష్, దేవిదాస్, మల్లేష్, ఉగ్గే విఠల్, సురేందర్, మహేశ్ పాల్గొన్నారు.

108 వాహనానికి రూట్ క్లియర్

జైనథ్: జైనథ్ మండలంలోని నిరాల గ్రామం వద్ద జాతీయ రహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం వాహనాల రద్దీ విపరీతంగా పెరగడంతో 108 ఇరుక్కుపోయింది. అటుగా వస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న 108 వాహనాన్ని గమనించి రూట్ క్లియర్ చేశారు.

బజార్‌హత్నూర్‌లో వర్షం


కొత్తపల్లిలో నేల కూలిన చెట్టు

బజార్‌హత్నూర్: మండలంలోని బజార్‌హత్నూర్, కొత్తపల్లి, దేగామ, జాతర్ల, గిర్నూర్, బలన్‌పూర్ గ్రామాల్లో ఆదివారం అకాల వర్షం కురిసింది. గాలి తీవ్రతతో కొత్తపల్లిలో కప్పులు ఎగిరిపడ్డాయి. చెట్లు నేలకూలాయి. మండల కేంద్రంలో జొన్నల కొనుగోలు కేంద్రంలో జొన్నలు కుప్పలు పోసిన రైతులు ఇబ్బంది పడ్డారు.

తాంసిలో గాలివాన

తాంసి: మండలంలో ఆదివారం సాయంత్రం ఒక సారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు గిరిగాం, పాలోది, జామిడి, వడ్డాడి గ్రామాల్లో ఈదురుగాలుతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. గాలివాన బీభత్సానికి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలిపోయింది. గిరిగాం గ్రామంలో గ్రామానికి చెందిన సెడ్మాకి ఉల్లాస్ ఇంటి పక్కన ఉన్న చెట్టు ఇళ్లపై పడటంతో ఇల్లు ధ్వంసమైంది. మార్కెట్‌యార్డులో సైతం జొన్నలు విక్రయానికి తీసుకొచ్చిన రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

ఘనంగా పెర్సపేన్ పూజలు


ఊరేగిస్తున్న పెందూర్ వంశస్తులు


నవధాన్యలతో నైవేద్యాలు సమర్పిస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి: వైశాఖ (బావై)మాసం పురస్కరించుకుని మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో కులదేవత (పెర్సపేన్) పూజలను నిర్వహిస్తున్నారు. వడగామ్ గ్రామంలో ఉమ్మడి జిల్లా కోర్‌కార్ ఆత్రం వంశీయులు ఆదివారం పెర్సపేన్(పెద్ద దేవుడు) పూజలు చేశారు. అంతకుముందు వారు గ్రామ పొలిమేర చేరుకుని కులదేవత మఠం వద్ద పూజలు నిర్వహించారు. సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ ఊరేగింపుతో గ్రామం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆత్రం వంశీయులు, ఆడపడుచులు, అల్లుళ్లు, గ్రామస్తులు ఇంటికి వచ్చిన కులదేవతకు మొక్కులు చెల్లించారు. అనంతరం పాటగూడ సమీపంలో మడుగులో పుణ్యస్నానాలచరించారు. రాత్రి కులదేవత మఠం(ఆలయం) వద్ద సంప్రదాయ వాయిద్యాల మధ్య మహాపూజ నిర్వహించారు. కోర్‌కార్ ఆత్రం వంశీయులు శేకు, మనోహర్, సోనేరావ్, ఆత్రం శంకర్, భారత్ తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఆధ్మాత్మిక శోభ సంతరించుకుంది. వంశాల వారీగా పెర్సపెన్ (పెద్దదేవుడు) మహాపూజకు సర్వం సిద్ధం అవుతున్నారు. ప్రతీ ఏడాది మే నెలలో పౌర్ణమి రోజు పెర్సపెన్‌కు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావు తెలిపారు. ఈనెల 12న పెర్సపెన్ ఊరేగింపు, 13న గంగాస్నానం, గంగాపూజ, 14న మాదగ్గజలింగ్ (ముగింపు) కార్యక్రమం ఉంటుందన్నారు.

మూడు రోజుల పూజలు..

నార్నూర్ మండలంలోని ఖైర్‌డట్వా గ్రామంలో మెద్నికర్ పెందూర్ వంశస్తులు పెర్సపెన్ మహాపూజ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వం నుంచి వస్తున్న ఆచారం, సంస్కృతి, సంప్రదాయాలతో ఊరేగింపు నిర్వహించినట్లు కటోడా నీలాసావ్ తెలిపారు. గ్రామ పొలిమేరలో మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పెందూర్ సంతోష్, చందు, ఆనందరావు, తుకారం, జగన్నాథ్, మాడవి నారంజీరావు, మాడవి తుకారం పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన రాజేశ్వర్(47) గత కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. శనివారం తన భార్య కవ్వ సదాలక్ష్మిని మద్యం కోసం డబ్బులు అడగగా ఆమె నిరాకరించింది. ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆయన రాత్రి పట్టణంలోని ఎరోడ్రామ్ ప్రాంతంలో వేపచెట్టుకు టవల్‌తో ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

ధాన్యం కొనేదెప్పుడు..?


కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన ధాన్యం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలంలోని గంగన్నపేట, ఉట్నూర్ గ్రామాల్లో వరి కోతలు అయి రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రల వద్ద పోశారు. కాగా.. పది రోజుల నుంచి కొనుగోలు చేయాలని ఎదురు చూస్తున్నారు. అయినా.. అధికారులు కొనుగోళ్లు ప్రారంభించలేదు. ఒక వైపు అకాలం వర్షం కురుస్తుండటంతో నష్టపోతున్నామని వాపోతున్నారు. తమ బాధ ఎవరికీ చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

జైనథ్ మండలంలోని బెల్గాం గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామపంచాయతీ అధికారులకు పలుమార్లు సమాచారం ఇచ్చినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మురికి కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందని, వాటిని తొలగించడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.
– జైనథ్





అ'పూర్వ' సమ్మేళనం

బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2003-04 బ్యాచ్, జైనథ్ మండలంలోని దీపాయిగూడ జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాల 2008-2009 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. వారంతా ఒకేచోట కలుసుకొని సందడిగా గడిపారు. తరగతి గదిలోని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.
– బజార్‌హత్నూర్/జైనథ్

ప్రైవేట్ ఆస్పత్రి ఖర్చులను ప్రభుత్వమే భరించాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేసుకుంటే ఆ ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించేలా చూడాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా.. ఆయన మాట్లాడుతూ ఏవైనా పెద్ద అనారోగ్య సమస్యలు తలెత్తితే నిరుపేదలు అప్పుల్లో కూరుకుపోతున్నారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స చేసుకుంటే రూ. లక్షల్లో బిల్లులు అవుతున్నాయన్నారు. అయితే సీఎంఆర్ఎఫ్ ద్వారా కేవలం రూ.65 వేల వరకు మాత్రమే ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుందన్నారు. దీంతో నిరుపేదలకు వైద్యం అందని ద్రాక్షగా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ముందు జాగ్రత్తగా హెల్త్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల ప్రవీణ్, కరుణాకర్ రెడ్డి, రాకేశ్‌రెడ్డి, సన్నీ, మయూర్ చంద్ర, రవి, రమేశ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, యువత క్రీడా మెళుకువలను నేర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వడూర్‌లో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తూ వడూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బహుమతులుగా సొంత డబ్బులు రూ.35వేలు అందజేశారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిత మార్గంలో పయనించాలి

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిత మార్గంలో పయనించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వడూర్ పరిధిలోని భవానితండా గ్రామంలో నిర్మించిన రబడే అమర్ సింగ్‌నాయక్ గుడి ప్రారంభోత్సవానికి ఆదివారం హాజరయ్యారు. దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

కాంగ్రెస్ వాగ్దానాలు ప్రజలు నమ్మడం లేదు

ఇచ్చోడ: కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మడం లేదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని తలమద్రిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వంద మంది యువకులు అనిల్‌జాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగించిందన్నారు. తమమద్రి మాజీ సర్పంచ్ నాగోరావు, ఉపసర్పంచ్ అడెల్లుతో పాటు బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, నర్వడే రమేశ్, సాబీర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో ఆలయాల నిర్మాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న జోగు రామన్న

ఆదిలాబాద్: బీఆర్ఎస్ హయాంలో ఎన్నో ఆలయాల నిర్మాణం జరిగిందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణోత్సవంలో ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో లోక కల్యాణార్థం యాగాలు, హోమాలు చేయడం జరిగిందన్నారు. స్వామి వారి కృపతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గణేష్ శర్మ, వినోద్ శర్మ, సంతోష్ శర్మ, కిరణ్ శర్మ, ఎక్స్ ఎంపీపీ చందాల రాజన్న, గడ్డం లస్మన్న పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది


విష్ణువర్ధన్

ఆదిలాబాద్‌టౌన్: ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసి కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎప్‌సెట్) ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్ఆర్ కళాశాలకు చెందిన పలువురు ర్యాంక్ సాధించినట్లు కళాశాల జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో 1000 మార్కులకు 993 మార్కులు సాధించిన కె.ఎంజెల్ ఎప్‌సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 412వ ర్యాంక్ సాధించింది. అదే విధంగా సంజన 2421వ ర్యాంక్, రిషికేష్ 2834వ ర్యాంక్, అక్షితకు 3172, సాయిచరణ్ 3798, అశ్విని 4003వ ర్యాంకులు సాధించారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ అరవింద్ కుమార్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జైనథ్: మండలంలోని బెల్గాంకు చెందిన కట్కం విష్ణువర్ధన్ ఎప్‌సెట్‌లో 689వ ర్యాంక్ సాధించాడు. 91.91 శాతం మార్కులు పొందాడు. తల్లిదండ్రులు దాసు–విజయ, బంధువులు విద్యార్థిని అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

ఉట్నూర్‌రూరల్: ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత అయిన విద్యార్థులు ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల ప్రతాప్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు విశాలమైన తరగతి గదులు, బాలికలకు వేరు వేరుగా హాస్టల్ వసతి ఉందన్నారు. పుస్తకాలు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

బీజేపీ నాయకుల ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థన చేస్తున్న బీజేపీ నాయకులు

ఉట్నూర్‌రూరల్: దేశ జవానులకు పాకిస్తాన్ ఉగ్రవాదుల నుంచి ఎలాంటి ముప్పు ఉండవద్దని మండలంలోని లక్కారం గ్రామ చర్చిలో బీజేపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ మాట్లాడుతూ.. భారతమాత ముద్దు బిడ్డలంతా గుడిలో, చర్చిలో, మసీదుల్లో ప్రార్థన చేశామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బింగి వెంకటేశ్, శ్రీరాం నాయక్, కొండేరి రమేశ్, లింగాగౌడ్, కాల్వ రవి, గంగాధర్, సతీశ్, కుటికెల రమేశ్ పాల్గొన్నారు.